# ప్రేమలేఖ

"మధువొలకబోసే నీ చిలిపి కళ్ళు" అంటూ హమ్ చేస్తున్న విమల మంచం మీద ఒత్తిగిలి పడుకుని మెత్తని తలగడ చేతుల్లోకి తీసుకుంది. ఆమెకి నిజంగా అతని కళ్ళు మధువొలక బోస్తున్నట్లే తన్మయత్వం కలిగింది. ఎంత అందమైన కళ్ళు! ఎంత చక్కగా నవ్వుతాడు! ఉత్తరం మాత్రం ఎంత మధురంగా వ్రాశాడు! ఆ ప్రేమలేఖ చదివిన ఏ అమ్మాయీ ప్రేమలో పడకుండా వుండలేదు. తను నిజంగా అదృష్టవంతురాలు, కనుకనే అతని ప్రేమకి పాత్రురాలయింది. అతని ఉత్తరం చదివితే మనసు ఆకాశవీధిలో విహరిస్తుంది. తనేం తక్కువ తిందా! అతని లేఖకి జవాబుగా, మరింత అందంగా, ప్రేమగా, లాలనగా వ్రాసింది, రాత్రంతా నిద్రమానుకుని మరీ వ్రాసింది–

ఉత్తరం వ్రాస్తున్నప్పటి అనుభూతి మళ్ళీ విమల గుండెల్లో అలజడి చేసింది – గుబులుగా అనిపించింది. రాత్రి నిద్రలేక అలసటగా వుంది. ఉదయం క్లాసులో ఒక్క పాఠం చెప్పలేకపోయింది. అందుకే మధ్యాహ్నం సెలవు పడేసి ఇంటికొచ్చేసింది. బద్ధకంగా, మత్తుగా వుంది. నిద్ర మాత్రం రావడం లేదు.

శశిరేఖ తలుపు తోసుకుని హడావిడిగా లోపలికొచ్చింది. విమలలో మైకం ఒక్కసారిగా పటాపంచలైపోయింది. చటుక్కున లేచి కూర్చుంది.

శశిరేఖ ముఖం అలసటగా వుంది. కోపం వస్తే దిగమింగి వచ్చినట్లు వాడిపోయి వుంది.

"ఏమిటిలా వచ్చావ్" అంది విమల, మనసులో వున్న తడబాటుని సర్దుకుంటూ–

ఇంతకాలం నుండి యిద్దరూ ఒకటే ప్రాణం. ఏ విషయం వచ్చినా యిద్దరూ చెప్పేసుకుని, ఒకరి నుండి ఒకరు సలహాలు, ఓదార్పులూ, బెదిరింపులూ అన్నీ స్వీకరించేవారు. కాని మూడు రోజులుగా విమలలో జరుగుతున్న అలజడి శశిరేఖకి ఆమె చెప్పలేదు. చెప్పకపోవడంలో పెద్ద ప్రయోజనం లేకపోయినా, దాచడంలో మాత్రం కొత్త ఆనందాన్ని అనుభవించింది. మధ్యాహ్నం శలవుపెట్టి వచ్చేస్తున్నట్టు కూడా శశిరేఖకి చెప్పలేదు. అందుకే విమల కొంచెం గిల్టీగా బాధపడింది.

"నాతో మాటైనా చెప్పకుండా వచ్చేశావే, బాగానే వున్నావుగా – ఆ సూరేకాంతం చెప్తే, పరుగెట్టుకొచ్చా" అంది శశిరేఖ, నిష్ఠూరంగా.

"అబ్బే! ఏం లేదు. వంట్లో బాగానే వుంది. మనసులో డల్‌గా వుంటే చిరాకు అనిపించి వచ్చేశా" అంది విమల.

"ఓహో జబ్బు శరీరానికైతే ఏదో ఒకటి మందు చూడవచ్చు. కాని మనసుకైతే నా వల్ల కాదు" అంటూ కూజాలో మంచినీళ్ళు పోసుకుని గడగడ తాగేసింది శశి. పది నిముషాలు యిద్దరూ మాట్లాడుకోలేదు –

శశిరేఖ సీరియస్‌గా "నీకో విషయం చెప్పాలి అంది.

విమల గుండె దడదడలాడింది. 'ఏం చెబుతుంది? తన్నేమన్నా అంటుందా? ఎందుకంటుంది? దానికేం తెలుసని అంటుంది? అయినా ప్రతిదానికి తను యిలా కంగారుపడకూడదు. 'గుమ్మడికాయల దొంగలాగా' అనుకుని వెంటనే నవ్వు ముఖంతో శశిరేఖ వంక చూసింది. ఆమె హ్యాండ్‌బ్యాగ్‌లోంచి ఒక ఉత్తరం తీసి –

"ఇది చదువు" అంది. అది తీసుకుంటుంటే విమల చేతులు వణికాయి.

ఉత్తరం విప్పింది. 'మైడియర్ శశిరేఖా!' అని చూసి, చటుక్కున కింద పేరు చూసింది. అతనే – అవును అతనే – అనుమానమేమీ లేదు. అదే దస్తూరి – అదే వ్రాత –

విమల కళ్ళు గిర్రున తిరిగాయి.

ముఖం పాలిపోయింది. చెవుల్లోంచి వేడిగా సెగలు లేచాయి. గుండె గుల్లబారి పోయినట్లు తేలికైపోయింది. గాలిలో తేలిపోతున్నట్లనిపించింది. నరాల్లో రక్తం వేగంగా ప్రవహించింది. నిస్సత్తువ ఆవహించింది, అరిచేతుల్లో చమట పట్టింది. ఇవన్నీ గమనించిన శశి "చదవవే! చదవకుండానే అలా ముఖం తేలేస్తావేమిటి?" అని పక్కనే వున్న ఫిలిమ్‌ఫేర్ తీసుకుంది. విమల సర్దుకుంది. పై నుండి లేఖ పూర్తిగా చదివింది.

అదే ఉత్తరం. అక్కడక్కడ చిన్న చిన్న మార్పులు తప్పిస్తే అదే బ్లూ ప్రింట్. విమల కోపంతో ఉడికిపోయింది. అవమానంతో వూగిపోయింది. ఏడుపొచ్చే సమయంలో ఎలాగో ఆపుకుంది.

పుస్తకంలోంచి ముఖం బయటకి పెట్టి "నాకొచ్చిన ప్రేమలేఖ చదివే యింత దీలా పడితే - ఒకవేళ నీకే వస్తే గుండె ఆగి చస్తావేమో" అంది.

విమల గుండెల్లో యీ మాటలు బాకుల్లా దూసుకుపోయాయి. ఇలాంటి లేఖ చదివి తను యింతకు పూర్వం ఎంత సంబరపడింది - అర నిముషంలో విరిసన హరివిల్లులా అది కరిగిపోయింది - మోసం? పచ్చిమోసం - ఇదెలా సహించడం? శశికి జరిగిందంతా చెప్పేస్తే! ముఖాన్న పేడనీళ్ళు కొడుతుంది. చెప్తే ముందే చెప్పి ఉండాల్సింది. పైగా తను అతనికి జవాబు కూడా వ్రాసేసింది. ఇంకా ఆలోచించలేక పోయింది విమల. తన మీద తనకే అసహ్యం వేసింది. శశిరేఖకున్న నిదానం తనకెందుకు లేకపోయింది. తనెంత నిజాయితీగా తనకి ఉత్తరం చూపించింది? తను మాత్రం ఎంత స్వార్థంతో దాచుకుంది. ఇప్పుడెలా చెప్పేది? పోనీ తర్జన భర్జన పడుతున్నానని అబద్ధం చెప్దామన్నా, తను అతనికి జవాబు కూడా యిచ్చిందే - ఛీ - తనెంత తెలివి తక్కువగా ప్రవర్తించింది. ఇప్పుడేం చెయ్యాలి. అతను మోసగాడు, దగాకోరు, వంచకుడు. అందులో సందేహం లేదు. ఇద్దరం ఒకే చోట వున్నాం కదా. ఒకరితో ఒకరు చెప్పుకోమని ఎంత ధైర్యం? అతని అంచనా ప్రకారం చెప్పుకోము. అతని వూహ నా విషయంలో నిజమే అయిందిగా, ఛీ చదువుకున్నా నాకు దేవుఁడు తెలివితేటలు అసలు పెట్టలేదు. ఎలా? ఈ సమస్య ఎలా పరిష్కరించాలి. అతని దగ్గర నా ఉత్తరం చిక్కుకుపోయిందే -

విమల ఆలోచనలతో సతమతమయిపోతుండగా "ఏమిటే ఉత్తరం పుచ్చుకుని కొయ్యయిపోయావా ఏవిఁటి అంది శశిరేఖ.

విమల వెంటనే సమాధానం చెప్పలేకపోయింది.

"అంతగా యిష్టపడుతున్నాడు. పోనీ సంప్రదించి పెళ్ళికి..." ఆమె మాట పూర్తి కాకుండానే-

"వద్దు" ఒక్కటే కేక లాంటిది పెట్టింది విమల, శశిరేఖ ఆశ్చర్యంగా చూసింది.

"నీకు తెలీదు శశీ! అంత తొందర దేనికి? నిదానంగా ఆలోచిద్దాం" అంది. అందులో మాటలన్నీ ఆమెకి వ్యతిరేకమే. ఆమె ఆచరించనివే, అయినా అవే మాటలు

అనక తప్పలేదు. "శశిరేఖని అటు నుంచి మళ్ళించాలి. అదే తను చెయ్యకపోతే తన కింక పుట్టగతులు వుండవు" అని గట్టిగా అనుకుంది. శశిరేఖ కళ్ళు చిత్రంగా నవ్వాయి. ఏదో అనబోయి ఆమె పెదవులు ఆగిపోయాయి. ఒకసారి తల పంకించి "నువ్వు నా మేలు కోరేదానివి, నా సుఖాన్ని కోరే దానివి, నీ సలహా కంటే నాకేం కావాలి?" అంది ఫిలిమ్ ఫేర్‌లో రిషికపూర్ బొమ్మనే నిశితంగా చూస్తూ. విమల మనసు బాధతో మెలికలు తిరిగింది.

"థాంక్యూ వెరీమచ్" అంది.

విమలకి రాత్రంతా నిద్రపట్టలేదు. కోపంగా, అసహ్యంగా, వేదనగా మనసు మథనపడిపోతోంది. తన బాధ ప్రాణ సమానురాలైన శశిరేఖకి చెప్పుకోలేని స్థితిలో వుంది. అతను ఉత్తరం వ్రాశాడంటే శశి ఏమీ అనదు. తను నాలుగు రోజులా విషయం దాచినందుకూ ఏమీ అనదు. కాని తను అతనికి జవాబిచ్చినందుకు మాత్రం క్షమించదు. తను చేసిన పొరపాటు ఎలా దిద్దుకోవాలి అనే ఆలోచన. అదే ఆవేదన - అదే బాధ - విమల మనసుని కొరికేస్తున్నాయి.

అతన్ని కలిసి ఛెడామడా కడిగిపారేయాలని ఎంతో ఆలోచించింది. కానీ తన జుట్టు అతని చేతికిచ్చి అతనితో వాదం పెట్టుకపోడం అవివేకం. అతను తన్ని అందరిలో అన్‌పాపులర్ చేస్తాడు. అవహేళన చేస్తాడు. అలాంటి మనస్తత్వమే కానివాడయితే యిద్దరికీ ఒకే రకంగా ప్రేమలేఖలు వ్రాసి, ఎవరు దొరికితే వారినే పట్టుకుందామని చూస్తాడా! అబ్బ! నా ఉత్తరంలో అంతా నా కోసమే అన్నట్లు, శశి ఉత్తరంలో కూడా అలాగే వుంది అంటే అతనిది. ఆట - లవ్ గేమ్ - సరే - ఎలాగైనా బయటపడకుండా అతని ఆట కట్టేమార్గం చూడాలి.

❖ ❖ ❖

రెండు బస్సులు వదిలేసుకుంది విమల. అతని జాడ ఎక్కడా లేదు. విసుగ్గా వుంది. కనిపిస్తే మాటలలో పెట్టి మరింత విషయం లాగాలని వుంది. చూసి చూసి విసిగిపోయి ఆరుగంటలకు బస్సు వస్తే ఎక్కేసింది.

ఇంటికొస్తే యింకా శశిరేఖ రాలేదు. ఎందుకు రాలేదో అనుకుంటూ స్నానం చేసి, పని ముగించుకుని కూర్చుంది విమల.

అప్పుడే ఉషారుగా యింట్లో అడుగుపెట్టిన శశి "చాలా సేపైందా వచ్చి" అంది. విమల తలవూపి వూరుకుంది.

శశి పది నిముషాలలో ముఖం కడుక్కుని, కాఫీ కలిపి యిద్దరికీ తెచ్చి "ఏమిటలా వున్నావ్. కాఫీ తాగు, హాయిగా వుంటుంది" అంది. విమలకి శశిరేఖవైపు చూడడానికి భయంగా వుంది.

"ఇందాక అతను కలిశాడు. అలా షికారుగా నడిచివెళ్ళాం. ఏవేవో మాట్లాడు కుంటూ చాలాదూరం నడిచాం" అంది శశిరేఖ, ఓరకంట విమలని చూస్తూ.

విమల హతాశురాలైపోయింది. ఎక్కడో మనసులో మారుమూల వున్న అనుమానం నిజమైంది. పెదవి విప్పలేకపోయింది. చిరాకుగా అనిపించింది. అయినా ఏమిటా షికార్లు అనిపించింది. తను చెప్తే మరోలా అనుకుంటుంది. ఎలా చెప్తుంది? ఏం చెప్తుంది? శశిరేఖ ఏవేవో కబుర్లు చెప్తూనే వుంది. విమలకి మాత్రం వాటిలో కొన్నే వినిపించాయి.

❖ ❖ ❖

ఆ రోజు కూడా శశిరేఖ ఆలస్యంగా వస్తానంటే విమల ఒక్కర్తీ బయులేదరింది. బస్సుస్టాపులో ఆలోచిస్తూ నిలబడింది. 'శశి తనని తిట్టినా సరే యీ వేళ అసలు జరిగిన విషయమంతా చెప్పెయ్యాలి' అనుకుంది. తను వ్రాసిన ఉత్తరం అతని దగ్గర నుండి ఎలా రాబట్టాలా అని కాస్సేపు మథనపడింది.

"హల్లో! బస్సు కోసమా" అన్న అతని మాటలతో ఉలిక్కిపడింది విమల. ఆమె వొళ్ళు భగ్గుమంది. కళ్ళు ఎర్రబారాయి. కడుపులో సన్నగా నొప్పి బయలుదేరింది. మనోభావాలు నలుగురూ చూస్తారని ఒక వెకిలి నవ్వు నవ్వింది.

"చాలాసేపైంది కదూ మీరొచ్చి" అన్నాడు. అదే నవ్వు, అందమైన పలకరింత, అవే మెరిసేకళ్ళు.

ఇతని ఉద్దేశమేమిటో పూర్తిగా తెలుసుకోవాలనే మొండికోరిక పుట్టింది. మాటలు కలిపింది. అతను అయిదు నిముషాలు మాట్లాడి కాఫీకి రమ్మని ఆహ్వానించాడు. విమల ధైర్యంగా కదిలింది.

అందమైన ఏ.సి. హోటల్లో యిద్దరూ కూర్చున్నారు. "ఉత్తరం..." అని యింకా ఏదో అనబోయింది. యింతలో పక్క టేబుల్ దగ్గరకి ఎవరో వచ్చారు. వాళ్ళని చూసి ఆగింది. అతను ముందుకు వంగి –

"ఎన్నో ఉత్తరాలు చెప్పలేని భావాలు మీ కళ్ళల్లో చూస్తున్నా" అన్నాడు.

'రాస్కెల్' అనుకుంది విమల. తియ్యగా, హాయిగా మాట్లాడాడు. విమల అతన్ని

చూసి ఆశ్చర్యపోయింది. ఇదే వైఖరి శశి దగ్గర కూడా నిన్న చూపించి వుంటాడు. గుండెలో మంటగా వుంది. రెండు గుక్కలు కాఫీ తాగి వదిలేసింది. చీకటి పడింది.

ఇల్లు చేరేసరికి శశి వచ్చేసి వుంది. పని పూర్తి చేసి కూర్చుని వుంది. విమలని చూడగానే "ఇంత ఆలస్యమేమిటి?" అంది.

"నా కాలేజ్ మేట్ మనోరమ కలిసి, స్టీలు కొట్టుకు రమ్మంటే వెళ్ళాను" అంది. అబద్ధాలు మొదలైనందుకు మనసులో కుంచించుకుపోయింది. తన పొరపాటు ఎలా దిద్దుకోవాలా అన్నదే విమల బాధ. అందుకే మరీ నీరసపడిపోయింది.

❖ ❖ ❖

వారం రోజులు గడిచిపోయాయి. విమల ఆలోచిస్తూనే వుంది. అతను కనిపిస్తూనే వున్నాడు. ఏడవలేక నవ్వుతూనే వుంది. అతను ప్రేమ పాటలు పల్లవేస్తుంటే చెవులప్ప గించి వింటూనే వుంది. అప్పుడామెకి వంటిమీద తేళ్ళూ, జెర్రెలు పాకుతున్నట్లూ వుంది. అతను తనని బ్లాక్‌మెయిల్ చేస్తాడన్న భయంతో యింకా వూబిలోకి వెళ్ళి పోతున్నట్లు కంగారుగానూ వుంది.

❖ ❖ ❖

ఆ రోజు సాయంత్రం యింటికొచ్చేసరికి శశిరేఖ చాలా గంభీరంగా వుంది. విమలకి కొంచెం ఆశ్చర్యం వేసింది.

"నాన్నగారికి ఉత్తరం వ్రాసి, అతని తల్లిదండ్రుల్ని కలుసుకోమని వ్రాద్దామను కుంటున్నా" అంది శశి.

విమల తల్లడిల్లిపోయింది. మనసు నిలవలేదు. గుండె దడదడలాడింది. కళ్ళలో నీరు వరదైపోయింది. భోరున ఏడ్చేసింది. శశిరేఖ ఆశ్చర్యంగా "అరె ఎందుకూ" అంటూ విమల చేతుల్ని ముఖానికి అడ్డం తీసింది. విమల నాలుగు మాటలలో ఆవేశంగా జరిగింది చెప్పేసింది. అంతే - విమల చెంప ఛెళ్ళుమంది. ఆమె నిర్ఘాంతపోయి నిలబడింది.

"నేనెందుకు కొట్టానా అని ఆశ్చర్యపోతున్నావు కదూ! నీకతను ఉత్తరం వ్రాసినందుకూ కాదు, దానికి నీవు జవాబిచ్చినందుకూ కాదూ, ప్రాణానికి ప్రాణమైన నా దగ్గర ఆ విషయం దాచినందుకు. పూర్ విమలా, నీ అదృష్టం బాగుంది. నీకు నేను ఫ్రండునయ్యాను. నువ్వనుకున్నట్లు నేనా బ్రూట్‌ని ప్రేమించనూ లేదు, వాడి ప్రేమని స్వీకరించటానికి సిద్ధంగానూ లేను. నాకుత్తరం వచ్చిన రోజే నీతో

చెప్తామనుకున్నాను. కాని ఆ రోజు మధ్యాహ్నం ఫిఫ్తుక్లాసులో రమకి యిచ్చి నువ్వు పోస్టు చెయ్యమన్న ఉత్తరం నేను చూశాను. ఆ పిల్ల బయటకెడుతుంటే ఎక్కడికని అడిగాను చెప్పింది.

అదే శాస్త్రీ దగ్గర నుండి నాకూ ప్రేమలేఖ వచ్చింది కదా అందుకే ఆతురత పట్టలేక చింపి చూశాను. అందులో నీ పిచ్చివ్రాత చూసి నవ్వుకుని, నీకు మంచి గుణపాఠం చెప్పాలనుకున్నాను. నాకు అతను, వ్రాసిన ప్రేమలేఖ చూసి నువ్వు నీళ్ళు కారిపోయినప్పుడే అనుకున్నాను.

ఏం చెయ్యాలో తెలీక నువ్వు పడే బాధ నాకర్థమౌతూనే వుంది. నా కోపమంతా ఒకటే. నేనేమైపోయాననీ, చచ్చిపోయానా, నాతో చెప్పకుండా నీలో నువ్వే అంత బాధపడాల్సిన పనేముంది?

ప్రేమట- ప్రేమ నాతోనూ చెప్పాడు కల్లబొల్లి కబుర్లు. ఛీ, మగాడు ఎవర్నీ ప్రేమించడు. తనని తనే ప్రేమించుకుంటాడు తన సుఖం కోసం ఎదుటి వారిని ప్రేమించావని మోసం చేస్తాడు. అంతే - మనిద్దరం ఒకే చోట వున్నా ఒకరితో ఒకరం ఇలాంటి విషయాలు మనసు విప్పి చెప్పుకోమని అతని ఉద్దేశం. అది నీ విషయంలో నిజమే అయింది. ఆడవాళ్ళు పక్కవాళ్ళ గురించి పుకార్లు, పుక్కిటి కథలు కల్పిస్తారుగాని, ఎంత సన్నిహితులైనా ఒకరి అంతరంగిక విషయాలు మరొకరు పట్టించుకోరు. చెప్పినా సరిగ్గా అర్థం చేసుకోరు. అందుకే మగాళ్ళకి మనతో 'గేమ్' ఆడడం చాలా తేలిక - అన్ని విషయాలు అందరికీ చెప్పుకోకపోయినా కొన్ని ఆత్మీయులకి చెప్పుకోవటం తప్పులేదు- ఇదిగో నీ ప్రేమలేఖ. ఇది అతని చేతులో వుందని అతను చెప్పినట్లుగా చేసి, ఆ రోగ్ వెంట తిరగనవసరం లేదు. చిన్న పొరపాటుకి భయపడి తప్పులు పుట్టగా మారిపోవాల్సిన పని లేదు" చాలా ఆవేశంగా మాట్లాడింది. శశిరేఖ. విమల ఆమె భుజం మీద తల ఆన్చి ఎంతో ఏడ్చింది. అది ఏడుపూ, ఆనందం, బాధా అన్నీ కలిసిన ఒక అవస్థ-

ఆ రాత్రి విమల చాలా రోజుల తర్వాత హాయిగా నిద్రపోయింది.

("స్నేహ" మాసపత్రిక నుండి)